# సాఫ్ట్‌వేర్ 'ఇతి'హాస్యం [6]

~ అద్దంకి అనంత రామయ్య



**సీరియల్:** సాఫ్ట్‌వేర్ 'ఇతి'హాస్యం [6]

**రచన:** అద్దంకి అనంత రామయ్య

**ప్రచురణ:** కినిగె పత్రిక patrika.kinige.com

**కాలం:** ఫిబ్రవరి 2014

**శాశ్వత లింకు:** http://patrika.kinige.com/?p=1641

©Author.

**What can you do with this document?**

Read it!
Store this PDF on your device.
Share the link with your friends
Share this PDF with your friends via personal communication (e.g. email)
Take printouts for personal use

**What is not allowed by Owner of this document?**

Editing the document. No page to be removed or added.
Distributing to public (instead kindly share the link to Kinige given above)

# సాఫ్ట్‌వేర్ 'ఇతి'హాస్యం [6]

*అత్యధికంగా అమ్ముడుపోయిన ఈ-పుస్తకంగా పేరు తెచ్చుకున్న "రామ్@శృతి.కామ్" రచయిత అద్దంకి అనంతరామయ్య రాసిన రెండవ హాస్య నవల ఈ "సాఫ్ట్‌వేర్ 'ఇతి'హాస్యం". దీన్ని వారం వారం సీరియలైజ్ చేస్తున్నాం.* ***ఇది ఆరవ భాగం.***

దీని ముందుభాగం

వేణు పూర్తి పేరు వేణుగోపాలరావు. ఇబ్బంది పడుతూ ఇంజనీరింగ్ ఐదేళ్ళల్లో పాస్ అయ్యాడు. చదువు లేదు కానీ తెలివితేటలు మాత్రం అమోఘం. అన్నింటిని మించి తనమీద తనకి నమ్మకం ఉంది.చదువొక్కటే జీవితం కాదని చిన్నతనంలోనే తెలుసుకున్నాడు. జీవితంలో సరైన మలుపు ఎక్కడ దొరుకుతుందో అని వెతుకుతున్నాడు. కొన్ని విషయాల్లో ఆ వేణుగోపాలస్వామికి ఏ మాత్రం తీసిపోడు. ముఖ్యంగా అందమైన కన్నె పిల్లల మనస్సు దోచే విషయంలో. ఫేస్ బుక్ లో ఫ్రెండ్స్ ఎక్కువ, పేస్ లో మాత్రం కళ తక్కువ. ముఖ పుస్తకంలో తెలిసిన అమ్మాయి, తెలియని అమ్మాయి అన్న తేడా, మొహమాటం లేకుండా కూడిక అభ్యర్ధనను పంపిస్తుంటాడు. వారితో ఎలాగోలా మాటలు కలపటం, వారి ఫోటోలు సంపాదించటం, అందంగా ఉంటే పరిచయం పెంచుకుని ఫోను నెంబర్ తీసుకోవటం, అందంగా లేకపోతే, అంతే అందంగా తప్పుకోవటం వీడికి నెట్ తో పెట్టిన విద్య. అలా వాళ్లతో గంటలు గంటలు సోది చెప్తూ ఉంటాడు. "అదొక కళరా! అందరికీ రమ్మన్నా రాదు" అని పైపెచ్చు గర్వంగా చెప్తుంటాడు. "మనకు ఒక్క అమ్మాయితో మాట్లాడటానికే లేదనుకుంటే, వీడికి వారానికో అమ్మాయి దొరుకుతున్నది" అని స్నేహితులంతా వేణు మీద పడి ఏడుస్తుంటారు.

"ఏరా వీడింక మారడా?" అడిగాడు గుప్తా, అజయ్ ని. "ఎందుకు మారడు? ఇలా ఇంజనీరింగ్ అయిపోయి మూడేళ్ళు అయినా గాలికి తిరుగుతుంటే, ఇంట్లో వాళ్ళు మాత్రం ఎన్ని రోజులు చూస్తారు? ఎప్పుడో వాళ్లకి సహనం పోతుంది, వీడికి జ్ఞానం వస్తుంది, అప్పటిదాకా ఈ గోపాలుడి లీలలు భరించక తప్పదు" అని నిట్టూర్చాడు అజయ్. "ప్రతోడి చేతికి సెల్లు ఆరో వేలు లాగా తయారయ్యింది.

నాకు తెలిసి సెల్లు, గోళ్ళు ఒకే లాంటివి. గోళ్ళు బాగా పెంచటం అమ్మాయిలకు అందం, అడ్డమైన చర్మ వ్యాదులు ఉన్న వాళ్లకు, సిటీ బస్సు కండెక్టరుకు అవసరం (సిటీలో టికెట్టును చేతి గోరుతో చించి ఇస్తుంటారు గనుక), మనకు ఆ గోళ్ళు అనవసరం. అలానే సెల్లు కూడాను, బాగా డబ్బు ఉన్న వాడికి అందం, అజయ్ లా ఉద్యోగం చేసే వాడికి అవసరం, వేణు లాంటి వాళ్లకి అనవసరం", అన్నాడు గుప్తా.

"వీడికి కస్టమర్ కేర్ లో ఉద్యోగం అయితే సరిగ్గా సరిపోతుంది" అని రాజుగారు అనటంతో అంతా నవ్వారు,అజయ్ తప్ప. "ఏమి ఉద్యోగాలో, వచ్చేదాకా రాలేదని, వచ్చాక చేయలేమని, చస్తున్నాము" అన్నాడు కాస్త అసహనం ప్రదర్శిస్తూ అజయ్. "ఏమైంది అజయ్, ఒక్కసారిగా చావు దాకా వెళ్ళావు?" అడిగాడు పంతులుగారు. "ఏముంది పంతులుగారు, ఏమని చెప్పమంటారు? ఆఫీసులో అసలు మనశ్శాంతి లేదు. ఒకవైపు పనివల్ల మానసిక ఒత్తిడి, వ్యాయామం లేక శారీరక ఒత్తిడి, ఇవన్నీ చాలక విసిగించే మేనేజరు, వెరసి అన్నీ సమస్యలే" అంటూ చేతిలో ఉన్న పేక ముక్కలను క్రిందకు జార్చాడు. "అంతలా ఏమి చేస్తున్నాడేంటి మీ మేనేజరు?" అడిగాడు గుప్తా. "ఒకటేమిటి, వాడి ఆకృత్యాలకి అంతే లేదు. పని ఎంత చేసినా, ఏదో ఒక నస పెట్టి చంపుతుంటాడు. పని నాకు, పొగడ్తలు తనకు. ఏడ్పు నాకు, ఎదుగుదల తనకు. రోజూ ఏదో ఒక గొడవ, ఈ సాఫ్ట్ వేర్ లో పని చేయటమే నరకము. జీతం కనిపిస్తుంది తప్పించి, ఈ జాడ్యాలు ఎవ్వరికీ కనపడవు. ప్రతి అడ్డమైన వాడికీ భయపడుతూ పని చేయటం నా వల్ల కాదు. బడిలో పంతుళ్ళకు భయపడి, ఇంట్లో నాన్నకు భయపడి, బజార్లో సమాజానికి భయపడి, ఆఫీసులో మానేజరుకి భయపడి,ఇలా ఎన్ని రోజులు?" అని భావోద్వేగానికి లోనయ్యాడు అజయ్.

"ఆరోజు విక్రమార్కుడి సినిమాకెళ్తే, నీకు ఫోను వచ్చి బయటకు వెళ్ళినప్పుడు, ప్రకాష్ రాజ్, రవి తేజతో చెప్పాడు, మనిషికి భయం మీద గౌరవం ఉండాలి అని, నువ్వు వినలేదు, ఆ సినిమా మళ్ళీ ఒక సారి చూడు" అన్నాడు గుప్తా. అజయ్ రెండు క్షణాలు ఆగి "ఏమో ! ఈ సాఫ్ట్ వేర్ నా వల్ల కావటం

లేదు" అన్నాడు. "ముక్కలు సరిగా పడకపోతే మిడిల్ డ్రాప్ చేస్తాం కానీ, ఆటే మానేస్తామా? ఈ కంపెనీ కాకపోతే ఇంకోటి, ఈ మేనేజర్ కాకపోతే ఇంకొకడు" అన్నాడు వెంకటరావు, తన ముక్కలని కూడా కింద పడేస్తూ. పేక ఆడేటప్పుడు మాట్లాడితే ముక్కలు మంచిగా రావని వెంకటరావుకో పిచ్చి నమ్మకం. అందుకే ఆట ఆడినంత సేపు మాట్లాడడు.

"అవును అజయ్, వెంకటరావు చెప్పింది నిజం. సమస్య ఎదురైనప్పుడు, దాని నుండి దూరంగా పోవాలి అనుకోవటం, పిరికి లక్షణం. దానిని ఎదురించి గెలవాలి" అన్నాడు పంతులు గారు. "వేరే కంపెనీ లో మేనేజరు కుడా ఇలా ఉండడని గ్యారెంటీ ఏది?" అన్నాడు అజయ్. "ఉంటాడని గ్యారెంటీ ఏది?" అన్నాడు గుప్తా. " గ్యారెంటీలు గురించి మీరు మాట్లాడకండి ! గ్యారెంటీ అంటే మాది, గ్యారంటీ ఇవ్వాలన్నా మేమే, దానిని గ్యారెంటీగా ఎగ్గొట్టాలన్నా మేమే" అన్నాడు రాజుగారు నవ్వుతూ. "అందరూ చెడ్డ వాళ్ళు ఉండరు, అందరూ మంచివాళ్లుండరు" అన్నారు పంతులుగారు.

"మీరేమైనా చెప్పండి, ఈ సాఫ్ట్ వేర్ జాబులో శాటిశ్ఫాక్షన్ లేదు" అన్నాడు అజయ్. "చూశారా పంతులుగారు, మనం వీడికి మంచి చెబుతుంటే, వీడేమో మనల్ని ఇంగ్లీష్ లో శాటిస్ఫై అనేదో తిడుతున్నాడు" అని వెంకటరావు పంతులుగారి వైపు చూశాడు. "అయినా శాటిశ్ఫాక్షన్ ఏమైనా సాక్షి పేపరా? నాలుగు రూపాయలు పెట్టి కొనుక్కోవటానికి ,రోజంతా చదువుకోవటానికి" అని గుప్తా అన్నాడు. "రాజకీయాలకే అనుకున్నా, ఈ అసంతృప్తి అనేది ఈ సాఫ్టోళ్ళకు కూడా ఉందనమాట!" అన్నాడు రాజుగారు. "చేసే పని ఇష్టంగా చేస్తే, అదే మనల్ని శాటిస్ఫై చేస్తుంది. మనకు మనం సర్దుకుపోతే అదే సంతృప్తి" అన్నారు పంతులుగారు. "నా బాధ మీకు అర్థం కాదు" అన్నాడు అజయ్ దీనమైన ముఖంతో. " ఏంటిరా నీ బాధ? చక్కగా ఏ.సిలో ఏళ్ళ తరబడి వ్రేళ్ళు ఆడిస్తూ, ఎండ ఎరగకుండా, ఎడా పెడా సంపాదించుకోక, అసమ్మతి, అసంతృప్తి అంటావే" అన్నాడు గుప్తా. కాసేపు అంతా నిశబ్ధం.

"సరేరా ఉద్యోగం మానేసి ఏమి చేస్తావు అది చెప్పు?" అన్నాడు గుప్తా. "ఏ వ్యాపారమో, వ్యవసాయమో, మీరందరూ బతకటం లేదా? అలానే" అన్నాడు అజయ్. "మా బాబే ఎంత తేలికగా అనేశావు. నీకంటికి వ్యాపారం, వ్యవసాయం అంత తేలికగా కనిపిస్తున్నాయే, ఒకసారి దిగితే లోతెంతుందో, మొసళ్ళెన్నున్నాయో తెలిసేది. పేకాడినంత సులభం కాదు పొలం దున్నటం" అన్నాడు వెంకటరావు. "మీరు కూడా సాఫ్ట్ వేర్ తప్ప ఇంకొకటి లేదన్నట్టు మాట్లాడాతారేంటి? ఆకలి,అరుగుదల,నిద్ర సరిగ్గా ఉంటే అమెరికా అయినా అద్దంకి అయినా పెద్ద తేడా ఉండదు" అన్నాడు అజయ్. "సరేరా! ఆ తేడాలేంటో ఇప్పుడే తేల్చేద్దాము" అన్నాడు వెంకటరావు. అంతా ముక్త కంఠంతో సరే అన్నారు.

"సరే ! అక్కడ ఆఫీసులో నీకు ఎంతమందిరా మొగుళ్ళు, అదే మేనేజర్ లు" అన్నాడు గుప్తా. "ఒక్కడికే చస్తున్నా" అన్నాడు. కాబట్టి నీకు ఒక్కడే మొగుడు. నాకు కొట్టుకు వచ్చే ప్రతివాడు మొగుడే. నువ్వు ఒక్కడిని ఒప్పిస్తే సరిపోతుంది. నేను వచ్చిన ప్రతివాడిని ఒప్పించాలి. ఒక్కోసారి గంటసేపు గంపెడు చీరలు తీయించి, గంగాళం అంత చెమట కక్కాక, నచ్చలేదు అని చెప్పి వెళ్తుంటారు. ఇలా కొంతమంది వంద రూపాయలు విలువ చేసే దానిని యాభైకి అడిగి, ఇవ్వలేదని విసుక్కొని వెళ్లిపోతుంటారు. ఈ మధ్య అందరూ బ్రాండుల మీద పడ్డారు. అవి కూడా దాదాపు పట్టణాల్లోనే కొంటున్నారు. పెళ్లిళ్లకు ఎలాగూ పెద్ద ఊర్లకు వెళ్లి కొంటారు. ఇంకా మా ముఖం ఎవడు చూస్తాడు? ఇవన్నీ గాక, కొట్లో కుర్రాళ్ళకి జీతాలు ఇవ్వాలి, పని ఉన్నప్పుడు ఎక్కువ మందిని తీసుకుంటాము, పని లేకపోయినా జీతాలు ఇవ్వాలి, మీ సాఫ్ట్ వేర్ లో బెంచ్ లాగా. ఇన్నింటి మధ్య మాకు ఏమి గిట్టుబాటు అవుతుంది చెప్పు?" అన్నాడు గుప్తా. అజయ్ ఏమి మాట్లాడకుండా ఆలోచిస్తూ కూర్చున్నాడు.

"ఇంకా వ్యవసాయం అంటావా? దాని గురించి చెప్పేదేముంది.ఎంత కాయకష్టం చేసినా పంట పేకాటలా తయారయ్యింది. మన అదృష్టం మీద ఎక్కువ ఆధారపడుతుంది. నరైన విత్తనాలు దొరకాలి, పురుగుమందు దొరకాలి, వర్షాలు కురవాలి, అన్నీ చేసి చివరకు పంట చేతికొచ్చే సమయానికి ఏ

గాలివానో రాకుండా ఉండాలి, ఇవన్నీ జరిగాక కూడా, మంచి ధర రావాలి, ఇన్ని అద్భుతాలు జరిగితే తప్ప అన్నం సరిగ్గా తినలేని పరిస్థితి. అందుకే కదా ఈ రోజుల్లో భోజనాలు చేసే రైతుల కన్నా ఆత్మా హత్యలు చేసుకునే రైతులు ఎక్కువైపోయారు. ప్రభుత్వమే ప్రజలకు పని కల్పించటం మొదలు పెట్టిన తర్వాత ,ప్రజలు పొలంలో పని చేయటం మానేసారు. పొలంలో పనికి ఎవ్వరూ రావటం లేదు. వచ్చినా ఎక్కువ మొత్తం లో ముట్టచెప్పాలి, ఇన్నింటి మధ్య వ్యవసాయం ఓ సాహసం అనే చెప్పాలి" అన్నాడు వెంకటరావు.

అజయ్ ఏమి మాట్లాడకుండా పంతులుగారి వైపు చూశాడు. "ఆయన వైపు చూడటం దేనికిలే ఆయన పరిస్థితి ఇంకా దారుణం. గమ్మత్తు ఏంటంటే, దేశంలో రోగులు పెరిగితే హాస్పిటల్స్ కళకళలాడుతున్నాయి గానీ, పాపులు పెరిగితే మాత్రం గుళ్ళు కళకళలాడవు. అయినా నీవు ఇప్పుడు గుళ్ళో పూజలు చేయటం కుదరని పని" అని వెంకటరావు అన్నాడు. రాజుగారు కల్పించుకొని "ఇక నా సంగతి అంటావా? రాజకీయాల్లోకి దిగి చాలానే ఖర్చు చేశా! అటు పదవి వచ్చేట్టు లేదు, ఇటు పనులు జరిగేట్టు లేవు. అన్ని ముక్కలు సరిగ్గానే ఉన్నా అస్సలు లైఫు దొరకటం లేదు. ఇంతకుముందు ఎన్నికలకు జనాలు డబ్బులు ఇచ్చిన వాళ్ళకి ఓటు వేసేవాళ్ళు, ఇప్పుడు అందరి దగ్గర డబ్బులు తీసుకుని, ఎవరి కులాన్ని మతాన్ని బట్టి వాళ్ళు ఓటేస్తున్నారు. డబ్బులు ఇవ్వకపోతే కనీసం గుర్తు కూడా గుర్తుంచుకోరు ఈ జనాలు. ఇక్కడ అందరి పరిస్థితి అంతంత మాత్రం గానే ఉన్నది.ఏదో రియల్ ఎస్టేట్ వల్ల ,మీ బోటి సాఫ్ట్ వేరోళ్లు స్థలాలు కొనటం వల్ల కొంత కోలుకున్నాము కానీ, లేదంటే మా పరిస్థితి దారుణంగా ఉండేది" అని రాజుగారు తన ఉపన్యాసాన్ని ముగించాడు.

ఆఖరి దెబ్బ గట్టిగా ఉండటం కోసం పంతులుగారు అజయ్ కి ఒక పిట్ట కథ చెప్పటం మొదలు పెట్టాడు. "ఒకసారి సముద్రుడు, తనలో కలిసే నదులతో ఇలా అడిగాడట, "మీ వేగం అమోఘం. కానీ అంత వేగంతో పారే మీరు, పెద్ద పెద్ద చెట్లను సైతం నేల కూల్చి, మీతో పాటు తీసుకు వస్తారు. కానీ చిన్న చిన్న గడ్డి పరకలని ఏమీ చేయకుండా ఎందుకు వదిలేస్తారు?" అని. దానికి నదులు, "చెట్లు

తాము కింద నుండి దృడంగా ఉంటామనే గర్వంతో మాకు ఎదురుగా నిలబడతాయి. కానీ గడ్డి మా ప్రవాహం వైపుకు ఒంగి వాటి ప్రాణాలను కాపాడుకుంటాయి" అని నదులు అన్నాయట! దీన్ని బట్టీ మనకు అర్ధం అయిన నీతి ఏంటి?" అన్నాడు పంతులుగారు. ఎవ్వరూ ఏమీ మాట్లాడలేదు. "మనకు పరిస్థితులు అనుకూలించనప్పుడు, మనం అణిగి ఉండాలి" అని పంతులుగారు ముగించారు.

అందరూ కలిసి జ్ఞాన స్నానం చేయించటంతో, అజయ్ కి ఏమి మాట్లాడాలో అర్ధం కాలేదు. వీళ్ళు చెప్పిన దానిని బట్టి చూస్తే, సాఫ్ట్ వేరే సుఖం అని మాత్రం అజయ్ కి అర్ధం అయ్యింది.

[తరువాయి భాగం వచ్చే వారం]

For Latest Telugu Books - Visit now:
Kinige
.com